## క్లుప్తంగా

### కాంగ్రెస్ పార్టీలో చేరికలు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రానికి చెందిన కుప్పిలి చైతన్యకుమార్, డాక్టర్ తిరుపతిరావు, బలివాడ మన్మధరావు కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. ఈ మేరకు డీసీసీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 2024 ఎన్నికల వరకు చైతన్యకుమార్ బీజేపీ, టీడీపీ పార్టీలకే సేవలందించారు.

### నేడు గ్రామసందర్శన

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు గ్రామంలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తారని.. ప్రజలు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

### పన్నుల వసూలుపై ఆరా



లైసెన్స్ ఫీజులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలోని ఆరో వార్డులో మార్పు చేసిన ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లను కమిషనర్ కె. అప్పలరాజు బుధవారం తనిఖీ చేశారు. షాపులను సందర్శించి లైసెన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పన్నులు, లైసెన్స్ ఫీజులు ఏ మేరకు వసూలు చేసిందీ ఆరా తీశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ కీర్తి

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. ఆ స్థలం ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నదీ, లేనిదీ ఆరా తీశారు. నిర్మాణానికి ఎంత విస్తీర్ణం అవసరమో నగర పంచాయతీ కమిషనర్ అప్పలరాజును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ సుదర్శనరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, మండల సర్వేయర్, సిబ్బంది ఉన్నారు.

### కుమిలిలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జె.డి తారకరామారావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలిలో బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. వ్యవసాయశాఖ జె.డి వీటీ రామారావు పర్యవేక్షణలో పంటకోత ప్రయోగం నిర్వహించగా... 5/5 విస్తీర్ణంలో 18.1 కిలోల దిగుబడి వచ్చింది. ఈ సందర్భంగా జేడీ రామారావు మాట్లాడుతూ, మండలంలో 58 పంటకోత ప్రయోగాలు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటివరకు 26 ప్రయోగాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కె.సీలిమ, ఏఎస్‌ఓ చంద్రశేఖర్, వీహెచ్‌ఏ సర్వర త్నంతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### భూముల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మధుపాడలో ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం పర్యటించారు. 22ఏలో ఉన్న తమ జిరాయితీ భూములను హక్కుగా కల్పించాలని సర్పంచ్ నల్లం అప్పారావుతో పాటు పలువురు హక్కుదారులు ఇటీవల సీఎంఓలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆర్డీఓ కీర్తి సంబంధిత భూములను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. రెవెన్యూ సర్వే నంబర్ 1లో 8.13 సెంట్ల భూమిలో 1.30 సెంట్లు భూమి బీసీ కాలనీకి పోయిందన్నారు. మిగిలిన భూమి సర్వే రికార్డులతో తమ పేరిట నమోదు చేసుకున్నామని, కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నామని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో 22ఏ భూములుగా పరిగణించడంతో క్రయ, విక్రయాలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. కార్యక్రమంలో నల్లం శ్రీనివాసరావు, సుదర్శనరావు, సత్యం, గోవిందరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఆహ్లాదం మాటున ఆపద...

- విహారానికి వచ్చిన వారు అప్రమత్తంగా ఉండాల్సిందే..
- ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదమే
- ప్రమాదకరంగా చింతపల్లి తీరం
- స్నానానికి దిగిన వారిని లోపలికి లాగేస్తున్న సముద్ర కెరటాలు



చింతపల్లి బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



చింతపల్లి బీచ్

పూసపాటిరేగ: ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతి సోయగాల మధ్య సముద్ర తీరం.. లైట్‌హౌస్ అందాలు.. సముద్రంలో కిలోమీటర్ మేర సౌందర్యంగా కనిపించే తిరుమల ఫ్యూజిటెక్ వంతెన.. వెరసి చింతపల్లి తీరం పర్యాటకులను కట్టిపడేస్తుంది. అయితే ఆ ఆహ్లాదం మాటున ఆపద పొంచి ఉంటుంది. స్నానాల కోసం సముద్రంలోకి దిగే పర్యాటకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలలు మాటున దాగి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేక యువకులు ప్రాణాలు వదులుతున్నారు. జిల్లాలో ఏకైక బీచ్ అయిన చింతపల్లి తీరానికి నిత్యం వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వీరంతా రోజంతా ఆహ్లాదంగా గడుపుతూ.. సాయంత్రం వేళ స్నానానికి సముద్రంలో దిగుతుంటారు. అయితే కొద్ది పాటి నిర్లక్ష్యం వల్ల చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకోగా.. కొంతమంది మృత్యువాత పడుతున్నారు. దీంతో ఈ తీరానికి ఆహ్లాదం కోసం వచ్చే వారు కాస్త అప్రమత్తంగా ఉండాలని స్థానికులు, అధికారులు సూచిస్తున్నారు.

**మత్స్యకారుల చొరవతో..**

గతేడాది కార్తీకమాసంలో ముగ్గురు యువకులు గల్లంతవ్వడంతో వెంటనే స్పందించిన మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారుల సహాయంతో ముగ్గురిని సురక్షితంగా రక్షించారు. తాజాగా గరివిడి మండలం దుమ్మెదకు చెందిన ముగ్గురు యువకులు గల్లంతు కాగా ఇద్దరు యువకులు మత్స్యకారులు సహాయంతో సురక్షితంగా బయటపడగా, ఎజ్జిపురపు అచ్చుతరావు అనే యువకుడు ప్రాణాలు విడిచాడు. అక్కడకు కొద్ది రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలోనే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. మృతదేహం గుర్తు పట్టలేనివిధంగా ఉండడంతో అతను ఎవరనేది ఇంతవరకు తెలియరాలేదు.

**ప్రమాదకరంగా తీరం..**

చింతపల్లి సముద్రంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. సముద్రంలోకి దిగగానే సుమారు పది అడుగుల గోతులు, రాళ్లు ఉంటాయి. ఇవి పసిగట్టని సందర్శకులు ప్రమాదంలో పడుతున్నారు. అలలు వస్తున్నప్పుడు సరదాగా గడుపుతూ యువకులు కేరింతలు కొడుతూ లోపలికి వెళ్లడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదకర తీర ప్రాంతంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సిన పర్యాటకశాఖ స్పందన కూడా అంతంత మాత్రమే ఉంది. మెరైన్ పోలీసులు పర్యాటకులను కొంత మేర నియంత్రించడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టినా.. ఏటా కార్తీకమాసంలో మాత్రం ఇంకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చింతపల్లి తీరంలో శాశ్వత ప్రాతిపదికన సెక్యూరిటీ గార్డులను నియమించి ప్రమాదాలను నియంత్రించాలని పర్యాటకులు కోరుతున్నారు.

**హెచ్చరిస్తున్నాం..**



చింతపల్లి తీరంలో స్నానాలకు దిగిన వారిని లోపలికి వెళ్లకుండా హెచ్చరిస్తున్నాం. కొందరు పర్యాటకులు ఖాతరు చేయకుండా లోపలికి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ప్రమాదం బారిన పడిన చాలా మంది పర్యాటకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చాం. సముద్రంలోకి వెళ్లకుండా నియంత్రిస్తున్నాం. వాశ్లె శ్రీనివాసరావు, ఎస్సై, చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్

**గార్డులు ఏర్పాటు చేయాలి**

చింతపల్లి రేవులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు చింతపల్లి బీచ్‌కు వస్తుంటారు. వారిలో చాలా మంది ప్రకృతిని ఆస్వాదిస్తూ స్నానాలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. చింతపల్లి బీచ్‌లో నిత్యం గార్డులు ఉంచి పర్యాటకులకు తగు సూచనలు ఇవ్వాలి.

– బి. చినఅప్పన్న, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

## ఆరోగ్య విద్యపై అవగాహన



మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల సముదాయ కార్యక్రమంలో పాల్గొన్న పీఈటీలు, పీడీలు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద గల ఏపీ మోడల్‌స్కూల్‌లో నెల్లిమర్ల నియోజకర్గంలోని పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలకు బుధవారం పాఠశాల సముదాయం కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, రిసోర్స్‌పర్సన్ జి.తవిటినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మోడల్ అసెంబ్లీ, యోగా, ఆరోగ్య విద్య, పొగాకు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 55 మంది పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులు అవసరం

- హోమియో వైద్యురాలు లక్ష్మీశైలజ



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీశైలజ

పూసపాటిరేగ: ఆరోగ్యకర జీవితం కోసం జీవనశైలిలో మార్పులు అవసరమని పూసపాటిరేగ హోమియో వైద్యశాల వైద్యురాలు లక్ష్మీశైలజ అన్నారు. బుధవారం స్థానిక హోమియో వైద్యశాలలో ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు గృహ వైద్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఔషధ మొక్కల పెంపకం.. వినియోగం.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ వర్మ, సీహెచ్‌ఓ వేదమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు ఉమాపతి, నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

విజయనగరం ఫోర్ట్: మహిళలు వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తానే అనిత అన్నారు.

బుధవారం స్థానిక కేఎల్ పురంలోని లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు, గృహహింస, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళలు రక్షణ, సంరక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు.

అదేవిధంగా వైద్య సహాయం కూడా వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తామన్నారు. ఆపదలో ఉన్న మహిళలు చైల్డ్‌లైన్ 1098, 181, 112, 1930 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..



పూసపాటిరేగ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు దామోధరరావు, తదితరులు



డెంకాడ: బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు, తదితరులు

పూసపాటిరేగ: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కుమిలి జెడ్పీ హైస్కూల్ తెలుగు అధ్యాపకుడు పి. దామోధరరావు అన్నారు. మండలంలోని కుమిలి గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్. ఇందుమతి, గుజ్జు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

**పూసపాటిరేగలో...**

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**విజ్ఞాన కేంద్రాలు..**

డెంకాడ: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, వీటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణ అన్నారు. మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ వై.మహేష్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో వివిధ రకాల కథలు, పురాణాల పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ దేవుడు, లైబ్రేరియన్ వై.మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన..**

నెల్లిమర్ల: నిత్యం గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చునని ఎంఈఓ ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంజేపీఏపీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

**గ్రంథాలయాలతో సమాజాభివృద్ధి..**

విజయనగరం అర్బన్: సమాజాభివృద్ధిలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని విజయనగరం మండల విద్యాశాఖ అధికారి డీవీబీ సుబ్బరాజు అన్నారు. స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పుస్తక పఠనాన్ని అలవర్చుకున్న మానవ సమాజంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా వయోజన విద్యశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సెల్‌ఫోన్ బారిన పడకుండా పుస్తక పఠనం చేయాలని సూచించారు. ప్రతి ఏటా ఇచ్చే జయంతి రామలక్ష్మణమూర్తి పురస్కారం ఈ ఏడాది దేవులపల్లి శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కేఎస్‌ఎన్ పట్నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గాజులరేగ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది.

**సీతంలో..**

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిశుసంరక్షణ కేంద్రానికి వెళ్లి విద్యార్థులకు 'నీతి కథలు' అనే పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్‌లు, పెన్సిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర కేసలి అప్పారావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, గ్రంథాలయాధికారిణి డాక్టర్ సత్యవతి, ఎన్‌సీసీ కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రశాంత్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ మూర్తి



విజయనగరం అర్బన్: బహుమతులు, జ్ఞాపికలతో విజేతలు, ఎంఈఓ డీవీబిరాజు



విజయనగరం అర్బన్: బహుమతులతో విజేతలు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

### పన్నులు చెల్లించండి..



పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మొండి బకాయలను వసూలు చేసేందుకు అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది బుధవారం నగరంలో పర్యటించారు. కేఎల్ పురం, బాలాజీ మార్కెట్ ప్రాంతాలలో పన్నులు చెల్లించని దుకాణాలకు వెళ్లి పన్నులు రాబట్టేందుకు ప్రయత్నించారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణ సముదాయాలు, కుళాయి పన్నులు, ప్రకటన పన్నులను సంబంధిత వ్యక్తులు తక్షణమే చెల్లించాలని కమిషనర్ నల్లనయ్య కోరారు. మొండి బకాయి దారులను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. – విజయనగరం

### సామాజిక మరుగుదొడ్లకు మోక్షం..



ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మరుగుదొడ్లను ప్రజారోగ్య సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. మరుగుదొడ్లతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రపరిచారు. మరుగుదొడ్ల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది నగరంలో ఉన్న అన్ని సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రపరిచి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు.

– విజయనగరం

### రామతీర్థంలో పునర్వసు నక్షత్ర పూజలు



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గత నెల 27 నుంచి బుధవారం వరకు ప్రతిరోజూ స్వామి సన్నిధిలో రామాయణ పట్టాభిషేక సర్గను అర్చకులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, వైదిక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

## జాబ్‌మేళాకు స్పందన

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు జిల్లా వ్యాప్తంగా 167 మంది నిరుద్యోగులు హాజరయ్యారని ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. వీరిలో 74 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని, మరో 8 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి డి.అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## రుణాల క్లయిమ్‌ల పరిష్కారానికి చొరవచూపండి

- ఏపీజీఎల్ఐ సంచాలకుడు రెడ్డి శ్రీనివాస్



పైడితల్లి చిత్రపటాన్ని అందుకుంటున్న ఏపీజీఎల్ఐ రాష్ట్ర సంచాలకుడు రెడ్డి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఖాతాదారుల రుణాల క్లయిమ్‌లు సకాలంలో పరిష్కారమయ్యే విధంగా సిబ్బంది చొరవ చూపించాలని ఏపీజీఎల్ఐ రాష్ట్ర సంచాలకుడు రెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన తొలుత పైడితల్లి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఏపీజీఎల్ఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సహ ఉద్యోగుల పట్ల, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల పట్ల ఏపీజీఎల్ఐ అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఏపీజీఎల్ఐ అందిస్తున్న సేవల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కేంద్రం సహాయ సంచాలకుడు ఏఆర్‌కే నాయుడు, విజయనగరం జిల్లా సహాయ సంచాలకురాలు జి.హైమావతి, కార్యాలయ పర్యవేక్షకులు కరుణ, సుధారాణి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలను వినియోగించుకోవాలి



ఆస్పత్రిలో తల్లీ,బిడ్డను పరామర్శిస్తున్న సర్పంచ్ బంగారమ్మ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ గదల బంగారమ్మ సూచించారు. స్థానిక పీహెచ్‌సీ నూతన భవనంలో మొట్ట మొదటి ప్రసవాన్ని వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. చిన్న బూరాడపేట గ్రామానికి చెందిన మజ్జి సత్యవతికి వైద్య సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, సర్పంచ్ బంగారమ్మ ఆస్పత్రిని సందర్శించి మొదటి ప్రసవం విజయవంతం చేసిన వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ధనుంజయ్, శిరీష, సిబ్బంది రూతమ్మ, సరస్వతి, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా స్కిల్ సెన్సస్ సర్వే

- ఎంపీడీఓ రామకృష్ణ రాజు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

నెల్లిమర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో స్కిల్ సెన్సస్ సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ రాజు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న అందరి స్కిల్ వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయాలన్నారు. అలాగే ఉద్యోగం, వ్యాపారం, వృత్తి కోసం కావాల్సిన నైపుణ్యాలను సర్వేలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుదర్శనం, ఈఓపీఆర్డీ శంకర్ జగన్నాథం పాల్గొన్నారు.